
సాక్షి
గుంటూరు
మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



సీహెచ్‌సీ సందర్శన

పొన్నూరు: నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం సందర్శించింది. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకుంది.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 41,082 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 82,027 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 42.1600 టీఎంసీలు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ సోమవారం దుర్గమ్మను దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

మహిళ అవయవాల దానం



రాజులపాటి పాప (ఫైల్)

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మణిపాల్ ఆసుపత్రిలో సోమవారం అవయవాల దానం జరిగింది. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ రామాంజనేయరెడ్డి, ఆంధ్రప్రదేశ్ జీవన్‌దాన్ చైర్మన్ డాక్టర్ కె. రాంబాబులు మాట్లాడుతూ.. తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటకు చెందిన రాజులపాటి పాప (64) ప్రమాదానికి గురి అయిందన్నారు. ఆమె బంధువులు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారని తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం శస్త్రచికిత్స నిర్వహించారని పేర్కొన్నారు. అయినా ఆమె ఆరోగ్య పరిస్థితిలో మార్పు కనిపించలేదని చెప్పారు. అనంతరం బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు ప్రకటించారని తెలిపారు. కుటుంబ సభ్యుల ఆమోదంతో ఆమె అవయవాలను సేకరించి కాలేయాన్ని మణిపాల్‌లో ఒక రోగికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారన్నారు. కార్నియాను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించామని వివరించారు. మంచి కార్యానికి ముందుకు వచ్చిన దాత కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

తురకపాలెంలో ఎన్‌సీడీసీ బృందం



గుంటూరు రూరల్: మండలంలోని తురకపాలెం గ్రామంలో నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) బృందం ప్రతినిధులు సోమవారం పర్యటించారు. గ్రామంలో పలు ప్రాంతాలను పరిశీలించి ఎస్సీ కాలనీలో ఒక ప్రాంతంలో , విలేజ్ క్లినిక్ ప్రాంతంలో మట్టిని సేకరించారు. బెంగళూరుకు చెందిన బృందంతోపాటు గుంటూరు జిల్లాలోని ఎన్‌సీడీసీకి చెందిన 40 మందికిపైగా పాల్గొన్నారు. అదేవిధంగా నీటి నమూనాలను కూడా సేకరించారు. మట్టి, నీటిని పరీక్షల నిమిత్తం తీసుకెళుతున్నట్లు బృందం సభ్యులు తెలిపారు.

న్యాయవాద కోర్సుల పరీక్షలు ప్రారంభం




పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీజీ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో సోమవారం మాస్టర్ ఆఫ్ లా (ఎల్‌ఎల్‌ఎం) ద్వితీయ సెమిస్టర్, ఐదు సంవత్సరాల ఆనర్స్ బీబీఏఎల్‌ఎల్‌బీ, బీఏఎల్‌ఎల్‌బీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈ మేరకు పీజీ పరీక్షల కో ఆర్డినేటర్ ఆచార్య ఎం .సుబ్బారావు తెలిపారు. ఎల్‌ఎల్‌ఎం పరీక్షలు ఏఎన్‌యూతోపాటు గుంటూరులోని జేసీ కాలేజ్ ఆఫ్ లా, ఏసీ కాలేజీ పరీక్ష కేంద్రాలలో కొనసాగుతున్నాయన్నారు. ఐదు సంవత్సరాల ఆనర్స్ పరీక్షలు విశ్వవిద్యాలయంలోని టీటీఎం విభాగంలో ప్రారంభం అయ్యాయన్నారు. పరీక్షలను సమర్థంగా నిర్వహించేందుకు ప్రత్యేక తనిఖీల బృందాలను నియమించినట్లు వివరించారు. వర్సిటీలో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

ఎంఎస్సీ కెమిస్ట్రీ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ (పెదకాకాని): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సు రెండో సెమిస్టర్ ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు సోమవారం విడుదల చేశారు. 507 మందికిగాను 357 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. అలాగే వర్సిటీ అందిస్తున్న డిప్లమో ఇన్ ఫొటోగ్రఫీ కోర్సు రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కూడా విడుదల చేశారు. 15 మందికి అందరూ ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రీవాల్యూయేషన్ కోసం ఈ నెల 23వ తేదీలోగా పేపరుకు రూ.1860 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

టెయిల్‌పాండ్ నుంచి నీరు



రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 5 క్రస్ట్‌గేట్లు, రెండు యూనిట్లు ద్వారా విద్యుత్ ఉత్పాదన అనంతరం మొత్తం 58,122 క్యూసెక్కులను పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం తెలిపారు.

నకిలీ మద్యం పాపం తమ్ముళ్లదే!

రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా చంద్రబాబు మార్చారని వైఎస్సార్‌సీపీ ఆగ్రహం

- అమాయకుల ప్రాణాలు తీస్తున్న నకిలీ మద్యం
- డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నోరు మెదపరేం?
- నకిలీ మద్యం తాగి మరణించిన వారందరివీ ప్రభుత్వ హత్యలే
- ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించి ఓడిపోయిన ప్రజలు
- కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఎదురుచూపు
- వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి
- గుంటూరులోని ఎక్సైజ్ డీసీ కార్యాలయం ఎదుట నేతల నిరసన
- పోతిన మహేష్, షేక్ నూరి ఫాతిమా, ఎమ్మెల్సీ ఏసురత్నం హాజరు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు



గుంటూరులో ప్లకార్డులతో ర్యాలీగా వస్తున్న విజయవాడ పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, గుంటూరు నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా, గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు పోతిన మహేష్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్/పట్నంబజారు: నకిలీ మద్యాన్ని ఏరులై పారిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. టీడీపీ నాయకులే నకిలీ మద్యం సూత్రధారులుగా మారిన వైనంపై క్షేత్రస్థాయిలో పోరాటాన్ని ప్రారంభించింది. నకిలీ మద్యాన్ని అరికట్టి, కారకులైన వారిని అరెస్టు చేయాలనే డిమాండ్‌తో సోమవారం గుంటూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. శంకర్‌విలాస్ సెంటర్లో నిరసన ప్రదర్శన జరిగింది. అనంతరం బ్రాడీపేటలోని ఎక్సైజ్ కార్యాలయానికి ర్యాలీగా తరలివెళ్లారు. సీఐ స్థాయి అధికారికి డిమాండ్ పత్రాన్ని అందజేశారు.

పచ్చ నేతలే అసలు సూత్రధారులు

మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ విజయవాడ పార్లమెంటు పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏరులై పారుతున్న నకిలీ మద్యం సూత్రధారులు టీడీపీ నాయకులేనని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మద్యం దుకాణాలను ప్రభుత్వ ఆధీనంలో ఉంచారని గుర్తుచేశారు. ఇప్పుడు కల్తీ మద్యాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఒక పరిశ్రమగా విస్తరించారని మండిపడ్డారు. టీడీపీ నాయకుల ఇళ్లలో వంట గదులకు బదులుగా నకిలీ మద్యం కుటీర పరిశ్రమలు వెలిశాయని తెలిపారు. టీడీపీతో పొత్తు పెట్టుకున్న ప్రధాని మోదీకి ఇది పెద్ద అవమానకరమన్నారు. పవన్ కల్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మద్యం కొనుగోలుదారులు తిరగబడాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించిన ప్రజలు ఓడిపోయారని, కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు.

వైఎస్సార్ సీపీ ఆందోళనతో సిట్

వైసీపీ గుంటూరు పార్లమెంటు పరిశీలకుడు పోతిన మహేష్ మాట్లాడుతూ నకిలీ మద్యానికి వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ ఎండగడుతోందన్నారు. ఆ పార్టీ ఆందోళనలతో దిగి వచ్చిన చంద్రబాబు భయంతో హడావుడిగా సిట్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తాను కేవలం పాత్రధారినేనని, దీని వెనుక చాలా మంది పెద్దలు ఉన్నారని టీడీపీ నేత జనార్దన్‌రావు చెప్పడంతోనే పెద్దల బాగోతం బయటపడిందన్నారు. ఈ వ్యవహారంలో టీడీపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల భాగస్వామ్యం ఉండబట్టే మిన్నకుండిపోతున్నారని ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నకిలీ మద్యం తాగి ఎంతో మంది మరణించారని అన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా ప్రతి బాటిల్‌కు క్యూఆర్ కోడ్‌తో పారదర్శకత అమలు చేసిందని చెప్పారు. అధికారుల సహకారం లేకుండా కల్తీ మద్యం తయారీ, విక్రయాలు జరగవన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన నిర్వహిస్తామని ముందుగానే సమాచారం ఇచ్చినప్పటికీ కార్యాలయంలో ఏ ఒక్క అధికారి కూడా అందుబాటులో లేరన్నారు.



గుంటూరులో ఎక్సైజ్ విభాగ అధికారికి వినతి పత్రం అందిస్తున్న, వైఎస్సార్‌సీపీ నాయకులు

మహిళలకు రక్షణ కరువు

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువైందని ఆరోపించారు. కల్తీమద్యం మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా పవన్‌కల్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ నకిలీ మద్యం తయారీదారులతోపాటు విక్రేతలు, ప్రోత్సహించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆధీనంలో జరుగుతున్న కల్తీ మద్యం వ్యవహారంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సైతం దోషులుగా నిలబడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, కార్పొరేటర్లు కృష్ణమాచారి, అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, కార్పొరేటర్లు కె.గురవయ్య, వలిపీరారెడ్డి, అజయ్‌కుమార్, విద్యార్థి విభాగ నగర అధ్యక్షుడు వినోద్‌కుమార్, శ్రావణ్‌కుమార్, అనిల్ రెడ్డి, యువజన విభాగ నగర అధ్యక్షుడు కోటేశ్వరరావు, సోషల్ మీడియా ప్రతినిధి కొరిటెపాటి ప్రేమ్ కుమార్ గనిక ఝాన్సీ, రమ్య, సువర్ణ, మహిళా నగర అధ్యక్షురాలు ఉషారాణి, నాయకులు శృంగారపు శ్రీనివాసరావు, తుమ్మేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిరసన జ్వాలలు...

మంగళగిరి నియోజకవర్గంలో నకిలీ మద్యానికి వ్యతిరేకంగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు నవులూరు ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.

- ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడులోని ఎక్సైజ్ కార్యాయలం వద్ద నిరసన తెలిపారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రదర్శనగా ఎక్సైజ్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఎక్సైజ్ సీఐ అశోక్‌ను కలిసి మెమోరాండం అందజేశారు.
- తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు ఆధ్వర్యంలో తాడికొండలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషను కూడలి వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు నినాదాలు చేసుకుంటూ ముందుకు సాగారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.
- పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పొన్నూరు పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కూటమి నేతల కనుసన్నల్లోనే నకిలీ మద్యం దందా సాగుతోందని నినదించారు. అనంతరం ఎక్సైజ్ సీఐ రమేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.
- తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. తెనాలి పట్టణంలోని శివాజీ చౌక్ నుంచి ఎక్సైజ్ స్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. గ్రామాల్లో బెల్టుషాపులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా, ఆయా నగర, పట్టణ కమిటీల నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పొన్నూరులో ఎక్సైజ్ సీఐ రమేష్‌కు వినతిపత్రం అందిస్తున్న అంబటి మురళీకృష్ణ, పార్టీ నాయకులు



తాడికొండలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేస్తున్న సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు, నాయకులు



ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషనులో సీఐ అశోక్‌కు వినతిపత్రం అందిస్తున్న బలసాని కిరణ్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు రసూల్ తదితరులు



మంగళగిరిలో నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు



తెనాలి ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసనలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ నేతలు

అవకాశం లేకనే ఆ బిర్యానీ తిన్నాం..

- అప్పటి నుంచే వాంతులు, విరేచనాలు
- విచారణకు వచ్చిన ఉన్నతాధికారుల ఎదుట విద్యార్థుల ఆవేదన



ప్రత్తిపాడు: పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామంలోని బీసీ బాలుర హాస్టల్‌లో 54 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం బీసీ సంక్షేమశాఖ స్టేట్ అడిషనల్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్‌రాజు, వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ బి.సుబ్రమణ్యేశ్వరిలు హాస్టల్‌లో విచారణ నిర్వహించారు. అధికారులు విద్యార్థులను ప్రశ్నించగా అవకాశం లేకనే బిర్యానీ తిన్నామని చెప్పారు. తాజాగా ఉందా, వాసన వస్తుందా అని అడుగగా తాజాగా లేదని తెలిపారు. హాస్టల్‌లోని వంటగది, విద్యార్థులు ఉండే రూమ్‌లు, బెడ్‌లు, వంట పాత్రలు, తాగు నీరు, తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్టల్ వాతావరణం అపరిశుభ్రంగా, గదుల్లో బూజుపట్టి ఉండటంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇదేమని సిబ్బందిని ప్రశ్నించారు. ఇంత ఘటన జరిగిన తరువాత కూడా హాస్టల్ ఇలా ఉంటే ఎలాగని ఆగ్రహించారు.

బయట నుంచి ఫుడ్ తెచ్చి ఎలా పెడతారు?

సస్పెన్షన్‌కు గురైన హాస్టల్ వార్డెన్ మార్కండేయులును పిలిపించి ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అసలు బయట నుంచి ఫుడ్‌ను లోపలకు ఎందుకు అనుమతిస్తున్నారని ప్రశ్నించారు. బయట ఫుడ్ అనుమతించకూడదు కదా అని మండిపడ్డారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండటం వలనే ఘటన చోటుచేసుకుందన్నారు.

అందువలనే ఫుడ్ పాయిజన్ అయ్యేది..

వంట మనిషి కల్పనతోనూ మాట్లాడారు. భోజనం వంట గది అపరిశుభ్రంగా ఉంటే చూసుకోవాలి కదా అని మండిపడ్డారు. పరిశుభ్రతకు సంబంధించి పలు సూచనలు అందించారు. వంట పాత్రలు శుభ్రంగా లేకున్నా కూడా ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశాలు ఉంటాయని సుబ్రమణ్యేశ్వరి స్పష్టం చేశారు. అనంతరం బీసీ సంక్షేమశాఖ స్టేట్ అడిషనల్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ రాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. తదనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఆరోగ్యం ఎలా ఉంది, ఘటన ఎలా జరిగింది, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంట జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి మయూరి తదితరులున్నారు.

అడ్డగోలు వసూళ్ల రెవెన్యూ!

- నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో ప్రతి సేవకో రేటు
- అడిగినంత ఇవ్వకపోతే ముందుకు కదలని ఫైళ్లు



నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు వివిధ కారణాలతో రెవెన్యూ అధికారులు రిజెక్ట్ చేసిన ఫైళ్లు ఏకంగా 5,075 కావడం గమనార్హం . గుంటూరు నగరపాలక సంస్థకు ఆస్తి పన్ను పేరు మార్పు, కొత్త ఇంటి పన్ను, వీఎల్‌టీ, ఇతర పనుల నిమిత్తం మొత్తం వచ్చిన దరఖాస్తులు 14,936. ఏ దరఖాస్తు అయినా 15 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ, గడువు పూర్తయిన తరువాత దరఖాస్తులు (బీయాండ్ ఎస్‌ఎల్‌ఏ) ఆమోదించినవి 1,600 ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఏదైనా సర్వీస్ రిక్వెస్ట్ రిజెక్ట్ కొట్టగానే సదరు దరఖాస్తుదారుడు రెవెన్యూ సిబ్బందిని కలిసి ప్రసన్నం చేసుకుంటే పనులు పూర్తి అవుతున్నట్లు పరిస్థితి నెలకొంది.

ఇవిగో నిదర్శనాలు...

- పొన్నూరు రోడ్డులోని ఓ ఖాళీ స్థలంలో ఇల్లు నిర్మాణం చేపట్టారు. సదరు స్థలానికి వీఎల్‌టీ (ఖాళీ స్థల పన్ను) ఉంది. ఇంటి నిర్మాణం పూర్తయిన తరువాత దానిని రెసిడెన్షియల్‌లోకి మార్చాలంటే ఖర్చు అవుతుందని రెవెన్యూ సిబ్బంది డబ్బులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం పన్ను నుంచి రెండున్నర సంవత్సరాలపాటు వెనక్కి వేసే వెసులుబాటు ఉంటుంది. వారు అడిగింది ఇవ్వకపోయే సరికి పన్ను ఉన్నదానికన్నా అదనంగా పెంచడంతోపాటు సంవత్సరం వెనక్కి వేశారు.
- అరండల్‌పేటలో ఓ ఇంటికి టైటిల్ ట్రాన్స్‌ఫర్ (టీటీపీ) చేయడానికి రూ.లక్ష డిమాండ్ చేశారు. విషయం చివరికి కార్పొరేషన్ కార్యాలయంలో తెలియడంతో కొంచెం వెనక్కి తగ్గారు.
- సంజీవయ్యనగర్‌లో ఓ వ్యాపార సంస్థకు కమర్షియల్ ట్యాక్స్ వేయాల్సి ఉండగా.. సదరు వ్యాపారస్తుల నుంచి మామూళ్లు తీసుకుని రెసిడెన్షియల్ ట్యాక్స్ వేసేందుకు దరఖాస్తు అప్రూవ్ చేశారు. దీనిని గమనించిన ఆర్వో సదరు దరఖాస్తును రిజెక్ట్ చేశారు.
- బృందావన్ గార్డెన్స్‌లో ఇంటి పన్ను పేరు మార్పు కోసం దరఖాస్తు వచ్చింది. కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది ఆ ఫైల్ తమ వారిదేనని, కొంచెం చేసి పెట్టాలని కోరినప్పటికీ డబ్బులు ఇవ్వాల్సిందేనని చెప్పారు. ఆ పని కోసం వారు కూడా డబ్బులు సమర్పించుకున్న పరిస్థితి.
- కొత్తపేటలో కూడా టైటిల్ ట్రాన్స్‌ఫర్ కోసం దరఖాస్తు వస్తే దానిని సకాలంలో పూర్తి చేయలేదు. సదరు దరఖాస్తుదారుడు బాధ్యులైన రెవెన్యూ సిబ్బందిపై ఫిర్యాదు చేశారు.

కనీసం రూ.10 వేలు ఇవ్వాల్సిందే..

కొత్త ఇంటి పన్ను సదరు స్థల విస్తీర్ణం బట్టి రూ.10 వేల నుంచి రూ. 50 వేలకుపైగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టైటిల్ ట్రాన్స్‌ఫర్‌కు సదరు భవనం స్థితిని బట్టి రూ.50 వేలకుపైగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

నేరుగా ఫిర్యాదు చేయండి

రెవెన్యూ సెక్షన్‌లో సర్వీస్ రిక్వెస్ట్ కోసం సిబ్బంది ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే నేరుగా ఫిర్యాదు చేయండి. సంబంధిత సిబ్బందిపై వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– చల్లా ఓబులేసు, అదనపు కమిషనర్

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	55,844
అమ్మకాలు	54,702
నిల్వ	12,857

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,800
నంబరు–5	10,000–14,500
273	10,500–14,000
341	10,000–15,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–15,000
నంబరు–5	10,000–14,500
341	10,000–15,600
4884	10,000–14,200
సూపర్–10	11,000–14,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,000
బాడిగ–355	10,500 – 15,600
దేవనూరు డీలక్స్	10,000 – 14,800
ఆర్మూర్	9,800 – 12,500
తాలుకాయలు	6,000 – 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–15,200
బాడిగ – 355	10,000–15,500
దేవనూరు డీలక్స్	10,500–14,700
తాలు	5,300 – 7,700

–కొరిటెపాడు (గుంటూరు)

బీసీ హాస్టళ్లలో వసతులు మెరుగుపరచాలి

- ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం
- విద్యార్థులను పరామర్శించాక వైఎస్సార్‌సీపీ నేతల డిమాండ్



చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న మోదుగుల, పోతిన మహేష్, నూరి ఫాతిమా, బలసాని తదితరులు

గుంటూరు మెడికల్: అనపర్రు బీసీ హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు కారణమైన వార్డెన్‌పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, బీసీ వసతి గృహాలలో వసతులు మెరుగుపరచాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను సోమవారం మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల రెడ్డి, గుంటూరు పార్లమెంట్ పరిశీలకుడు పోతిన మహేష్, ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ నూరి ఫాతిమా, రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్‌లు పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం పోతిన మహేష్ మీడియాతో మాట్లాడుతూ వార్డెన్ నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఆహారం విషపూరితంగా మారిందని, విద్యార్థులు తెల్లవార్లు వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో బాధపడినా సకాలంలో స్పందించలేదని వెల్లడించారు. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హాస్టళ్లలో భోజనం బాగుందని, మెను బాగా పెట్టేవారని విద్యార్థులు తమతో చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక భోజనం బాగుండటం లేదని వెల్లడించారన్నారు. అందుకే విద్యార్థులు నీరసించి పోయారన్నారు. ఎవరైనా సమస్యల గురించి తమ తల్లిదండ్రులకు చెప్పినట్లు తెలిస్తే చాలు ఆ విద్యార్థులను వార్డెన్ చితకబాదుతున్నట్లు ఆరోపించారు. ఇలాంటి వారిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

భయపడుతున్న తల్లిదండ్రులు

విద్యార్థులను హాస్టల్‌లో ఉంచేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారని, ఇళ్లకు తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారని, ఇది ప్రభుత్వం వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. జిల్లాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్, నాదెండ్ల మనోహర్, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌లు ఉన్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. హాస్టల్‌నే సరైన దిశగా నడిపించలేని వీరు రాష్ట్రాన్ని పరిపాలించగలరా అని ప్రశ్నించారు. జిల్లాలో నెలరోజులుగా పలు పెద్ద సంఘటనలు జరుగుతున్నా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. తురకపాలెంలో పెద్ద ఎత్తున మరణాలు సంభవించాయని, అయినప్పటికీ నేటి వరకు కారణాలు ప్రభుత్వం తెలుసుకోలేకపోయిందన్నారు. గుంటూరు నగరంలో గతనెలలో డయేరియాతో 200 మందికిపైగా చికిత్స పొందారని, తాజాగా బీసీ హాస్టల్ విద్యార్థులు అస్వస్థతతో చికిత్స పొందుతున్నారన్నారు. రాష్ట్రంలో అనేక చోట్ల విద్యార్థులు అస్వస్థతకు గురై అవస్థలు పడుతున్నారని, హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలన్నారు. తక్షణమే హాస్టల్‌ను సందర్శించి వసతులు మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మూడు రోజుల్లో వసతులు మెరుగుపడకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు వార్డెన్ ఫోన్ చేసి చెప్పలేదన్నారు. వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తురకపాలెంలో అనుకూలంగా ఉన్న కొంత మందికి రూ. 5 లక్షలు ఇచ్చి కంటి తుడుపు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఇక్కడ మరణాలకు కారణాలు తెలుసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నూరిఫాతిమా మాట్లాడుతూ వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారని చెప్పారు. నేడు రాష్ట్రంలో ఆ రంగాలు వెంటిలేటర్‌పై ఉన్నాయన్నారు. వరుసగా పలు సంఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని ఆరోపించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సినిమాలు చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారని, ప్రజలు చచ్చిపోతున్నా పట్టించుకునే పరిస్థితుల్లో లేరన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం దగ్గర నుంచి కింది స్థాయి అధికారుల వరకు నిర్లక్ష్యంగా ఉన్నారని, అందరూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. వారి నిర్లక్ష్యం వల్లే ఎంతో మంది ప్రాణాలు పోతున్నాయని, ప్రజలు బుద్ధి చెప్పే సమయం తొందరల్లోనే ఉందన్నారు. పాలించే అర్హత మంత్రులకు లేదని, తక్షణమే రాజీనామా చేయాలన్నారు. ప్రాణం విలువ రూ. 5 లక్షలా అంటూ ప్రశ్నించారు. పరిపాలన తెలియని వారు ఉన్నారని ఆరోపించారు.

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి అనాగరిక చర్య

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ

గుంటూరు వెస్ట్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్ గవాయిపై సాక్షాత్తూ దేశ అత్యున్నత న్యాయస్థానంలో న్యాయవాది చేసిన దాడి సభ్యసమాజానికి సిగ్గుచేటని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. సోమవారం స్థానిక డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. కృష్ణమాదిగ విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి దళితుడు కావడం వల్లే ఈ దాడి జరిగిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అనేక అభిప్రాయాలుంటాయన్నారు. దానికి ఇలా దాడులు చేయడం అత్యంత హేయమన్నారు. దళితులు దేశంలో ఎన్నో వివక్షలకు గురౌతూ ఎదుగుతుంటే కొంత మంది ఓర్వలేక అక్కసుతోనే ఇటువంటి సంఘటనలకు పాల్పడుతున్నారన్నారు. దళితులు మరింత పట్టుదలతో ఉన్నత స్థానాలను పొందాలని కోరారు.

జీఎస్టీ ఫలాలు పేదలకు అందాలి



గుంటూరు వెస్ట్: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మిక శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌లో భాగంగా నిర్వహించిన బైక్ ర్యాలీని డీఆర్వో జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... తగ్గిన పన్నుల శాతంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి గత నెల 22 నుంచి ఈ నెల 19వ తేదీ వరకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్మిక శాఖ బైక్ ర్యాలీ ద్వారా అవగాహన కల్పిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఆశారాణి తదితరులు ప్రసంగించారు. బైక్ ర్యాలీ కలెక్టరేట్ నుంచి హిందూ కళాశాల సెంటర్, జిన్నా టవర్, బస్టాండ్, మంగళగిరి రోడ్డు మీదుగా ఆటోనగర్ వరకు కొనసాగింది.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు



ప్రథమ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్న క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాష్ట్ర స్థాయి పిట్టు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలోని చంద్రగిరిలో ఈ నెల 11, 12వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ చాంపియన్ షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. బాలుర జట్టు ప్రథమ స్థానం, బాలికల జట్టు తృతీయ స్థానం దక్కించుకున్నాయని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దావులూరు సుబ్బారావు, పాపబత్తిని శ్రావ్యలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలను చైర్మన్ రంభ ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు పి.సురేష్, రాష్ట్ర కార్యదర్శి కె.జె జోసఫ్ అభినందించారని పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన



సిబ్బందితో మాట్లాడుతున్న ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం ప్రపంచ బ్యాంకు బృందం పర్యటించింది. అత్యవసర సేవల విభాగం, ఎస్ఎన్‌సీయూ, పీఐసీయూ, తదితర వైద్య విభాగాలను పరిశీలించారు. క్వాలిటీ ఎస్యూరెన్స్ నేషనల్ హెల్త్ మిషన్ తరఫున అత్యవసర విభాగం పనితీరు, అత్యధికంగా వస్తున్న రోగులకు మౌలిక వసతులు మెరుగుపరచవలసిన విషయాలపైన అధ్యయనం చేసేందుకు క్యాజువాలిటీలో బృంద సభ్యులు పరిశీలించారు. క్యాజువాలిటీలో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యవసర చికిత్స కోసం ప్రతిరోజూ ఎంత మంది రోగులు వస్తున్నారు, రోడ్డు ప్రమాద బాధితులకు ఏవిధంగా చికిత్సలు అందిస్తున్నారు, అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఎలాంటి సౌకర్యాలు క్యాజువాలిటీలో అందుబాటులో ఉన్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, అత్యవసర విభాగం పనితీరు గురించి, క్యాజువాలిటీలో రోగుల రద్దీని తగ్గించుటకు తీసుకుంటున్న చర్యల గురించి బృందానికి వివరించారు. అనంతరం అప్పుడే పుట్టిన పసికందుకు చికిత్స అందించే ఎస్ఎన్‌సీయూ విభాగాన్ని పరిశీలించారు. నవజాత శిశువుల మరణాల రేటు తగ్గించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాలపై వైద్యులు, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జీజీహెచ్‌లో రోగులకు ఇన్ఫెక్షన్ సోకకుండా ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, ఇతర వైద్యులు, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిని పరిశీలించిన వారిలో ప్రపంచ బ్యాంకు బృంద సభ్యులు డాక్టర్ మొహిర్ జోన్, డాక్టర్ ఎడ్వర్డ్, డాక్టర్ గణేష్ మణి ముతతూ, వాసు బాబు తదితరులు ఉన్నారు.

వర్షానికి పోలీస్ గ్రీవెన్స్ రద్దు



మీడియాతో మాట్లాడుతున్న చిట్టీల బాధిత మహిళలు

నగరంపాలెం: గుంటూరు నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారాల వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ మేరకు డీపీఓ వర్గాలు తెలిపాయి. సుదూర ప్రాంతాల నుంచి ఫిర్యాదులు చేసేందుకు వచ్చిన వారు ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన ద్వారం వద్ద పహారా నిర్వహించే పోలీస్ సిబ్బంది వారికి విషయం తెలిపారు. పక్కనే ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పీజీఆర్ఎస్ కొనసాగడంతో బాధితులు ఒకింత అసహనం వ్యక్తం చేశారు. దీంతో షామియానాలు, కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. బాధితులు డీపీఓ ఎదుట మీడియాతో మాట్లాడారు.

రూ.1.5 కోట్ల వరకు టోకరా..

ఏటీ అగ్రహారం 13వ వీధిలో ఉంటున్న ఓ మహిళ, ఆమె కుటుంబ సభ్యులు గత 25 ఏళ్లుగా చిట్టీ పాటలు నిర్వహిస్తున్నారు. రోజూవారీ పనులకు వెళ్తూ చిట్టీలు చెల్లించాం. అడిగితే మాపై దాడికి సిద్ధమవుతున్నారు. అరవై మందికిపైగా బాధితులు ఉన్నారు. సుమారు రూ.1.5 కోట్లు వరకు చెల్లించాలి.

– బాధితులు, ఏటీ అగ్రహారం

ప్రజా సమస్యల పరిష్కారమే ముఖ్యం


గుంటూరు వెస్ట్: ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసమే అర్జీలు పెట్టుకుంటారని, దీనిని గుర్తించి అధికారులు పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌కే ఖాజావలి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో అర్జీలను పూర్తిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వమే వైద్య కళాశాలలు నిర్వహించాలని దళిత బహుజన ప్రజా సంఘాలు, పార్టీల ఐక్యవేదిక నేతలు కోరారు. 228 అర్జీలను డీఆర్వో, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతి బసు, డ్వామా పి.డి. శంకర్ పరిశీలించారు.

విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల అవగాహన ఒప్పందం



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల మరియు అమెరికాలోని టెంపుల్ యూనివర్సిటీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని చైర్మన్ లావు రత్తయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెంపుల్ వర్సిటీతో ఫార్మ్ డీ ప్రోగ్రామ్‌కు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న దేశంలోని మొదటి సంస్థగా తమ కళాశాల గుర్తింపు పొందిందన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల పరస్పర మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు, సాంస్కృతిక, ఇంటర్ డిసిప్లనరీ అవగాహనను పెంచనున్నామన్నారు. ఈ అవగాహన ఒప్పందాన్ని సాధ్యమయ్యేలా కృషి చేసినందుకు ఫార్మ్ డీ ప్రోగ్రాం డీన్ డాక్టర్ సతీష్ ఎస్. గొట్టిపాటిని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



పెదకాకాని: వాకింగ్ చేస్తున్న మహిళల్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా, ఇరువురికి గాయాలయ్యాయి. పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన రమావత్ లక్ష్మి, కొమ్మూరి అరుణ, శ్రీదేవిలు ఇరుగుపొరుగువారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వీసు రోడ్డుకు రోజూ మాదిరిగానే సోమవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లారు. వెనుక నుండి వచ్చిన గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొని వెళ్లిపోయింది. రమావత్ లక్ష్మి(43) సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. గాయాలపాలైన కొమ్మూరి అరుణ, శ్రీదేవిలను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. లక్ష్మి భర్త రామునాయక్ ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇరువురు సంతానం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ టి.పి. నారాయణస్వామి తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ నష్టం



చినగంజాం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని మున్నంవారిపాలెం పంచాయతీ బేతాళవారిపాలెంలో సోమవారం పలు ఇళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువులు భారీగా కాలిపోయాయి. రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. గ్రామంలోని సచివాలయం రోడ్డులో తీగ తెగడంతో అత్యధిక విద్యుత్ గృహ సర్వీసుల్లోకి రావడంతో భారీగా ఉపకరణాలు దెబ్బతిన్నాయి. గ్రామంలో 20 పైగా ఇళ్లలో 10కి పైగా టీవీలు, బల్బులు, 30కి పైగా ఫ్యాన్లు, వాషింగ్ మెషిన్లు, ఇన్వర్టర్లు, స్విచ్ బోర్డులు తగులబడ్డాయి. భారీ శబ్దాలతో విద్యుత్ ఉపకరణాలు తగులబడి పొగలు రావడంతో నివాసితులు భయపడిపోయారు.